క్లుప్తంగా

వైభవంగా శిఖర ప్రతిష్ఠ

పమిడిముక్కల: మామిళ్లపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ భవానీ సమేత ముక్తేశ్వరస్వామి ఆలయ విమాన గోపుర శిఖర ప్రతిష్ఠ ఆదివారం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకుడు పొన్నూరు మల్లికార్జునరావు ఆధ్వర్యంలో నవులూరి సాయిబాబు దీక్షితులు ఆచార్యత్వంలో శిఖర ప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు అన్నదానం చేశారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



పమిడిముక్కల: రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. పమిడిముక్కల పీఏసీఎస్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. రైతు సేవా కేంద్రంలో తెలియజేసి అనుకూలమైన మిల్లుకు అమ్ముకునే స్వేచ్ఛను రైతుకు ఇస్తున్నట్లు తెలిపారు. గోనెసంచులు, రవాణా, కూలీ ఖర్చులు ప్రభుత్వం రైతుకు చెల్లిస్తుందన్నారు. ధాన్యం కొనుగోలులో ఏవైనా ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు, సర్పంచ్ ముళ్లపూడి సునీత పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



పామర్రు: చిన్న వయస్సులోనే రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకోవడం అభినందనీయమని అమరావతి ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కొనకళ్ల రెడ్డిమ్మ పేర్కొన్నారు. స్థానిక ప్రసన్న జూనియర్ కళాశాల ఆవరణలో ఉపాధ్యాయ సంఘ సభ్యుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పామర్రు మండలం ప్రాకర్ల గ్రామంలోని ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శివరామప్రసాద్‌కు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకోవడం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో ఆ సంఘ మండల అధ్యక్షుడు కె శ్రీను, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏడుకొండలు, కార్యదర్శులు యానాదయ్య, వెంకయ్య చౌదరి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కోటేశ్వరరావు, డీపీఆర్‌కు నాయుడు పాల్గొన్నారు.

సర్వేంద్రియాల్లో నేత్రాలే ప్రధానం



మండవల్లి: మానవాళికి సర్వేంద్రియాల్లో నేత్రాలే ప్రధానమని ఎస్‌ఐ సీహెచ్‌ఎస్ రామచంద్రరావు, ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ఎల్‌ఎస్ భాస్కరరావు, మండల శాఖ అధ్యక్షుడు టి.అప్పారావు అన్నారు. గన్నవరం కమ్యూనిటీ హాల్లో ఐక్య వేదిక మండల కార్యదర్శి గంజాల శ్రీనివాసరావు, బైరపాటి రామలింగం ఆధ్వర్యంలో ఆకివీడు ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ వారి ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. 100 మందికి వైద్య పరీక్షలు చేయగా, 15 మందికి ఆపరేషన్లు అవసరమని వైద్యులు పేర్కొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక ఆదాయం

పమిడిముక్కల: ఆయిల్ పామ్ సాగు చేపట్టి తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పేర్కొన్నారు. పమిడిముక్కల్లో 3ఎఫ్ ఆయిల్‌పామ్ కంపెనీ వారు ఏర్పాటు చేసిన నర్సరీని ఎమ్మెల్యే ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం రాయితీలు ఇస్తుందన్నారు. రైతులు నాదెళ్ల సుబ్రమణ్యం, మైనేని నరేంద్ర, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై కారు దగ్ధం



హనుమాన్‌జంక్షన్ రూరల్: 216 హెచ్ జాతీయ రహదారిపై బాపులపాడు మండలం ఆరుగొలను వద్ద ఆదివారం రాత్రి ఆకస్మాత్తుగా కారులో మంటలు చెలరేగాయి. దీంతో భయాందోళనకు గురైన కారులోని ఇద్దరు వ్యక్తులు బయటకు దిగి పరుగులు పెట్టారు. గుడివాడకు చెందిన జాస్తి శిరీష కుటుంబ సభ్యులు ఏలూరు వెళుతుండగా ఈ దుర్ఘటన జరిగింది. పెద్ద ఎత్తున మంటలు వ్యాపించటంతో క్షణాల్లో కారు పూర్తిగా దగ్ధమైంది. ఈ అగ్ని ప్రమాదంపై స్థానికుల నుంచి సమాచారం అందుకున్న హనుమాన్‌జంక్షన్ అగ్నిమాపక కేంద్రం సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. రహదారిపై కారులో మంటలు చేలరేగటంతో వాహనాల రాకపోకలకు కొద్దిసేపు తీవ్ర ఆటంకం ఏర్పడింది.

వరి కోస్తున్నారా.. జాగ్రత్తలు తప్పనిసరి

నాణ్యమైన ధాన్యం కోసం ..



ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు



ఏఓ అనంతలక్ష్మి

గుడ్లవల్లేరు: ఆరుగాలం కంటికి రెప్పలా కాపాడి వరిని పండించటం ఒక ఎత్తు అయితే.. ఆ ధాన్యపు రాశులను కోత సమయంలో కాపాడుకోవటం మరొక ఎత్తు. వరి ప్రస్తుతం చాలా చోట్ల కోత దశకు వస్తోంది. కొన్ని చోట్ల కోతలు కూడా మొదలు పెట్టేశారు. ఈ సమయంలోనే రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గుడివాడ వ్యవసాయాధికారి బోలెం అనంతలక్ష్మి తెలియజేశారు. తమ సలహాలు అనుసరిస్తే ధాన్యం నాణ్యత పెరిగి, మద్దతు ధర వస్తుందని చెబుతున్నారు. ఆమె మాటల్లోనే..

చివరి గింజ తయారయ్యాకే కోత

కంకుల్లో కల్తీ గింజలను ఏరివేయాలి. కంకిలోని చివరి గింజ తయారయ్యేంతవరకూ పంట కోయకూడదు. అంటే గింజలన్నీ బంగారు వర్ణంలోకి వచ్చే దాకా కోతలు ప్రారంభించకూడదు.



వరి పంటను కోస్తున్న కూలీలు

వరి కోతలకు ముందు పొలంలో ఉన్న నీటిని బయటకు తోడేయాలి. ఒక రకం ధాన్యాన్ని మరో రకం ధాన్యంతో కలపరాదు. మంచు ఆరిన తర్వాత గాని పంటను కోయించి, పనల్ని పొలంలో ఆరబెట్టాలి. యంత్రాలతో వరి కోసినపుడు మొదటి డబ్బాను పక్కకు పోసి ఆ తర్వాత డబ్బాలను ఒకచోట పోయటం వలన ధాన్యం కల్తీని అరికట్టవచ్చు.

ఆరబెడితేనే నాణ్యత

వరి గింజలను సిమెంట్ ప్లాట్‌ఫామ్‌పై గాని, పరదాల్లో గానీ ఆరబెట్టాలి. ఆరబెట్టిన గింజలను కాళ్లతో కలియ తిప్పటం వలన త్వరగా తేమ శాతం తగ్గుతుంది. గింజలు ఆరబెట్టకపోతే రంగు మారి నాణ్యత దెబ్బ తినే అవకాశం ఉంది. ధాన్యంలో మట్టి, చెత్తా చెదారం లేకుండా చూసుకోవాలి. నిల్వ చేసే ధాన్యం సంచులను



బస్తాల్లోకి ఎత్తేటప్పుడు పురుగుల నివారణ పిచికారీ తప్పనిసరి

నేలపై కాకుండా చెక్క బల్లలపై నెట్టు కట్టాలి. నిల్వ ఉంచిన ధాన్యాన్ని ఎలుకలు నాశనం చేయకుండా బస్తాల మధ్యన జింకు పాస్ఫేట్ మాత్రలు, పురుగుల నివారణకు లీటరు నీటికి ఐదు మిల్లీలీటర్ల మిలాథియాన్ మందును బస్తాలపై పిచికారీ చేయాలి.

ఘనంగా వనమహోత్సవాలు

గుడివాడ టౌన్: కార్తికమాస వన మహోత్సవాలు ఆదివారం పట్టణంలో ఘనంగా జరిగాయి. స్థానిక వాసవీచౌక్‌లోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో వన సమారాధనలో భాగంగా నియోజకవర్గానికి చెందిన ఏడు వేల మంది ఆర్యవైశ్యభక్తులకు అన్న ప్రసాదాన్ని అందజేశారు. స్థానిక ప్రణవాశ్రమంలో ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కార్తిక వన మహోత్సవాలు జరిగాయి. మహిళలకు, చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. స్థానిక వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజినీరింగ్ కళాశాల్లో యాదవ సేవాసంఘం ఆధ్వర్యంలో వన మహోత్సవాలు జరిగాయి.

వనసమారాధనలో ప్రజా ప్రతినిధులు

కైకలూరు: కార్తికమాస సందర్భంగా పలు సామాజికవర్గ వన సమారాధనలకు ఆదివారం ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. కలిదిండి పాతాళ భోగేశ్వర స్వామి ఆలయం వద్ద జరిగిన కాపు వన సమారాధనలో వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, స్థానిక ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ హాజరయ్యారు. ముందుగా పాతాళ భోగేశ్వరస్వామిని సందర్శించుకున్నారు. ఎమ్మెల్యే కామినేని తాడినాడ గ్రామంలో నియోజకవర్గ క్షత్రియ సామాజికవర్గ కార్తీక వన సమారాధనలో పాల్గొన్నారు.



కలిదిండి పాతాళ భోగేశ్వరస్వామి ఆలయం వద్ద కాపుల కార్తిక వనసమారాధనలో డీఎన్నార్



తాడినాడలో జరిగిన క్షత్రియ వనసమారాధనలో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్



కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

కొండలమ్మకు మొక్కుల చెల్లింపు



పాల పొంగళ్లు పొంగిస్తున్న మహిళా భక్తులు

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధిలో భక్తుల తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఆదివారం అధికసంఖ్యలో భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. పాల పొంగళ్లను పొంగించిన మహిళా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనానికి క్యూలో భక్తులు బారులు తీరారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ ఆకుల కొండలరావు ఏర్పాట్లు చేశారు.



ఈఓ కొండలరావుకు వెండి గిన్నెను అందించిన పవన్‌కుమార్ కుటుంబం

కొండలమ్మకు వెండి గిన్నె బహూకరణ

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారికి వెండి గిన్నెను ఏలూరు వాస్తవ్యులు బలభద్ర సర్వేశ్వర గుప్తా స్మారకార్థం వారి కుమారుడు పవన్‌కుమార్ బహూకరించారు. ఆదివారం ఆలయ ఈఓ ఆకుల కొండలరావుకు అందజేశారు. ఈ వెండి గిన్నె 998గ్రాముల బరువు ఉన్నట్లు కొండలరావు తెలిపారు. దాత కుటుంబాన్ని ఈఓ సన్మానించి అమ్మవారి చిత్రపటంతో పాటు లడ్డూ ప్రసాదాలను అందించారు.

గుడ్లవల్లేరు జట్టుకు ప్రథమ స్థానం



ప్రథమ స్థానంలో నిలిచిన గుడ్లవల్లేరు ఎస్‌ఆర్‌జీఈసీ కాలేజీ జట్టు

ఒంగోలు: జేఎన్‌టీయూ కాకినాడ ఆధ్వర్యంలో స్థానిక రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహిస్తున్న సెంట్రల్ జోన్ అంతర కళాశాలల మహిళా కబడ్డీ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో గుడ్లవల్లేరు ఎస్‌ఆర్‌జీఈసీ కాలేజీ – గుంటూరు సెయింట్ మేరీస్ జట్లు తలపడగా, ఉత్కంఠ పోరు సాగింది. ఈ మ్యాచ్‌లో గుడ్లవల్లేరు కాలేజీ టీం విజేతగా నిలిచింది. గుంటూరు సెయింట్ మేరీస్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. అనంతరం విజేతలకు రైజ్ కృష్ణసాయి ప్రకాశం గ్రూప్ కాలేజీల కార్యదర్శి శిద్దా హనుమంతరావు, కోశాధికారి శిద్దా భరత్, రాగ చీఫ్ కో ఆర్డినేటర్ శిద్దా ప్రవల్లిక, గౌరవ చైర్మన్ ఇస్కాల చినరంగమన్నార్, డైరెక్టర్ ఏవీ భాస్కరరావు ట్రోఫీలు అందించారు. అనంతరం యూనివర్సిటీ జట్టును ఎంపిక చేశారు. ఎంపికైన యూనివర్సిటీ జట్టు ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు కేరళ రాష్ట్రం కొట్టాయంలో ఆడుతుందని ఫిజికల్ డైరెక్టర్ హేమచంద్ర తెలిపారు. గుడ్లవల్లేరు ఎస్‌ఆర్‌జీఈఎస్ విద్యార్థి కోట అనంత యూనివర్సిటీ జట్టుకు ఎంపికయ్యాడు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం



గుడివాడ టౌన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న వెయిట్ లిఫ్టింగ్ పోటీలు శనివారం రాత్రి స్థానిక ఎన్టీఆర్ ఇన్‌డోర్ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. ఈనెల 18 వరకు ఈ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. అండర్–19 విభాగంలో జరుగుతున్న ఈ విభాగంలో 13 జిల్లాలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీలో పాల్గొంటారని పేర్కొన్నారు.

ఉత్తమ అధ్యాపకుడికి సత్కారం



మండవల్లి: రాష్ట్రంలో ఉత్తమ అధ్యాపకుడిగా అవార్డు అందుకున్న మెండా దేవానంద్‌కుమార్‌ను మండవల్లిలో ఆదివారం ఘనంగా సన్మానించారు. మాజీ సర్పంచ్ గుడివాడ చిట్టిబాబు, మెండా సురేష్, ముళ్లపూడి సత్తిబాబు, ఎల్‌ఎస్ భాస్కరరావు, బొమ్మనబోయిన గోకర్ణయాదవ్, గుడివాడ బాలాజీ, బండి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీరే దిక్కు

పట్టించుకోని అధికారులు

మోపర్రు(పెదపారుపూడి): మండలంలోని మోపర్రు గ్రామ ప్రజలకు కలుషితనీరు దిక్కుగా మారింది. గ్రామానికి వచ్చే అధికారులకు, పలుమార్లు సమస్యను చెప్పిన పట్టించుకోవటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పాలకులు నిర్లక్ష్యంగా ఉండటంతో ప్రజలు అంటువ్యాధుల బారిన పడుతున్నారు. ఎవరికి చెప్పుకోవాల్లో తెలియని పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ చెరువులో నీళ్ల పసరగా మారటంతో చేసేది లేక ఆ నీళ్ల సాన్నాలకు వాడుతుంటే దురదలు వస్తున్నాయని గ్రామానికి చెందిన బోయిన శివయ్య ఆవేదన వ్యక్తం చేశారు.

పని చేయని రెండు ఫిల్టర్ బెడ్లు

రెండు వేలు జనాభా ఉన్న గ్రామంలో గుక్కెడు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. దీనికి ప్రధాన



పంచాయతీ చెరువులో కలుషితంగా మారిన నీరు

కారణం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల నిర్లక్ష్యమేనని స్థానికులు ఆరోపిస్తున్నారు. మంచినీటి చెరువు వద్ద ఉన్న రెండు ఫిల్టర్ బెడ్లు పని చేయడం లేదు. దీంతో నీరు ఫీల్టర్ కావటంతో లేదు. ఈ విషయాన్ని మండల స్థాయి అధికారులకు చెప్పిన పట్టించుకోవటం లేదని గ్రామస్తులు తెలిపారు.

ఆలోచనలకు ప్రతిరూపం చిత్ర లేఖనం

జమీగొల్వేపల్లి(పామర్రు): చిత్ర లేఖనం అనేది మస్తిష్కంలోని ఆలోచనలకు ప్రతిరూపం అని మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి ఉషాదేవి అన్నారు. మండలంలోని జమీగొల్వేపల్లిలోని గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి నాగసురేష్ మాట్లాడుతూ వివిధ అంశాల్లో నిర్వహించే పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఈ నెల 20వ తేదీన బహుమతి ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

పామర్రులో ..

గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించినట్లు పామర్రు గ్రంథాలయ అధికారి ఎం.ఝాన్సీరాణి తెలిపారు.

పుస్తక పఠనంతో జ్ఞానం

మండవల్లి: పుస్తక పఠనంతో జ్ఞానం సమకూరుతుందని మందారపు తారకేశ్వరి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సమ్మేళనం రచయితల సారాంశం కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలయానికి వచ్చి చదువుకునే విద్యార్థులకు మూడు పుస్తకాలు బహూకరించారు. గ్రంథాలయాధికారి షేక్ పర్వీన పాల్గొన్నారు.



మండవల్లిలో బహూకరించిన పుస్తకాలతో విద్యార్థులు

ఆకట్టుకున్న కవి సమ్మేళనాలు

కైకలూరు: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం కవి సమ్మేళనాలు, సెమినార్లు, రచయితల సందేశాలు విద్యార్థులకు అందించారు. కైకలూరు గ్రంథాలయంలో ప్రముఖ సాహితీవేత్త చింతపల్లి వెంకటనారాయణ ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. కవులు, ఉపాధ్యాయులు చిట్టి పార్వతీశ్వర్, దండే బెనర్జీ, సముద్రుడు, మద్దాల రామబ్రహ్మం కవితలు వినిపించారు. పి.కల్యాణి గానం ఆకట్టుకుంది. గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు, సిబ్బంది లక్ష్మి, రాంబాబు, కాశీ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



జమీగొల్వేపల్లిలో తాము వేసిన చిత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కలిదిండిలో..

కలిదిండి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు కవితల పోటీలు నిర్వహించారు. ప్రముఖ కవులు ఎల్ ఆర్ పోలిశెట్టి, ప్రసాద్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ప్రథమ బహుమతి కలిదిండి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన టి.హనీ, ద్వితీయ బహుమతి శశి స్కూల్‌కు చెందిన జె.లిఖిత, తృతీయ బహుమతి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎల్.మానివ్రతాసాయి ఎంపికయ్యారు. వారోత్సవాల ముగింపు రోజున బహుమతులు అందిస్తామని గ్రంథాలయాధికారి జె.రమేష్ తెలిపారు.

అలరించిన నాటక ప్రదర్శన

గుడివాడ టౌన్: గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక షా గులాబ్‌చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో లఘునాటికల పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ కవి వసుధ బసవేశ్వరరావు మాట్లాడుతూ నాటక ప్రదర్శనలు సమాజానికి సందేశాలు ఇస్తాయని, అవి సమాజాభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బి. వెంకటరమణ, వెంకటేశ్వరరావు, డీఆర్‌బీ ప్రసాదు, ప్రవల్లిక పాల్గొన్నారు.



కైకలూరు గ్రంథాలయంలో కవి సమ్మేళనం



గుడివాడలో చిన్నారుల నాటక ప్రదర్శన

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: మండలంలోని అంగలూరుతో పాటు గుడ్లవల్లేరు గ్రంథాలయాల్లో విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు వారోత్సవాల ముంగిపు సభలో బహుమతుల ప్రదానం చేయనున్నారు. గ్రంథాలయాధికారులు పి.వి.వి.పద్మజ, టి.వాణి పాల్గొన్నారు.



గుడ్లవల్లేరులో విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలు

సంక్షిప్త వార్తలు

■ సంప్రదాయాలను కాపాడుకోవాలి

పామర్రు(తోట్లవల్లూరు): మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలైన జాతర ఉత్సవాలను మనం అందరం గౌరవించి కాపాడుకోవాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. తోట్లవల్లూరు మండలం కళంవానిపాలెంలో నిర్వహించిన గంగానమ్మ జాతరలో ఎమ్మెల్యే ఆదివారం పాల్గొన్నారు. ఆలయంలో అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

పామర్రు: స్థానిక సోమేశ్వరస్వామి ఆలయంలో కార్తిక మాసం ఆదివారం సందర్భంగా ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా ప్రత్యేక పూజలను చేశారు. కేదారేసిపల్లి శ్రీను స్వామి ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే ఆలయానికి చేరుకున్నారు.

■ 28న రమణ మహర్షి క్షేత్ర వార్షికోత్సవం

గుడ్లవల్లేరు: గుడివాడ శ్రీ రమణ మహర్షి పిరమిడ్ ధాన్య క్షేత్ర 12వ వార్షికోత్సవాన్ని ఈ నెల 28వ తేదీన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం అంగలూరులో గ్రామస్తులకు ఆత్మీయ ఆహ్వానం పలుకుతూ ర్యాలీ నిర్వహించి కరపత్రాలను పంచిపెట్టారు. గుడివాడ, విజయవాడ, పాడేరు, గుడ్లవల్లేరు, బొమ్ములూరు మాస్టర్స్ పాల్గొన్నారు.

■ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

గుడివాడరూరల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్‌ఐ ఎస్.చంటిబాబు పేర్కొన్నారు. మండలంలోని వలివర్తిపాడు అడ్డరోడ్డు సమీపంలో ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఎస్‌ఐ మాట్లాడుతూ తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలను ఇవ్వకూడదన్నారు. అలా చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. వాహనదారులు నిబంధనలు పాటించి సహకరించాలని ఎస్‌ఐ కోరారు.

■ రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

గుడివాడరూరల్: స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండలంలోని రౌడీషీటర్లకు ఆదివారం గుడివాడ తాలూకా ఎస్‌ఐ ఎన్.చంటిబాబు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ దొంగతనాలు, గొడవలు, మద్యం అక్రమ అమ్మకాలతో పాటు కోతముక్క, కోడి పందేలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సమాచారం ఇవ్వాలన్నారు. అనుమానిత వ్యక్తులపై పోలీసుల నిఘా ఎప్పుడూ ఉంటుందన్నారు.

■ 20 మద్యం బాటిళ్ల స్వాధీనం

గుడివాడరూరల్: మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని, 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ పి.వెంకటరమణ ఆదివారం తెలిపారు. గుడివాడ ఎక్సైజ్ పరిధిలోని పామర్రు మండలం కనుమూరులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు జీవీవీ సత్యనారాయణ ఇంటిపై దాడి చేసి 20 మద్యం బాటిళ్లను తమ సిబ్బంది స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

■ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

గుడివాడ టౌన్: ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం జరిగింది. నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా కోనా రామారావు, కార్యదర్శిగా దిమ్మిట శ్రీనివాస్, కోశాధికారిగా చింతా దుర్గా రామకృష్ణ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో పాస్ట్ గవర్నర్‌లు పి.చంద్రశేఖర్, పి.రామకృష్ణ, క్లబ్ పూర్వ అధ్యక్షులు ఎల్.ఈశ్వర వెంకటేశ్వరరావు, ఎం.శివరామకృష్ణ పాల్గొన్నారు.

శాఖాహారం అమృత ఆహారం



కూచిపూడి(మొవ్వ): శ్రీ రమణ మహర్షి పిరమిడ్ ధ్యానకేంద్రం ఆధ్వర్యంలో 'మహా కరుణ శాఖాహార' ర్యాలీని మొవ్వ మండలం కూచిపూడి, పెదపూడి గ్రామాల్లో ఆదివారం నిర్వహించారు. శాఖాహారం అమృత ఆహారం, భౌతిక సంపద కంటే జ్ఞాన సంపదే మిన్న, అహింసా ధర్మం వర్ధిల్లాలి, ఇల్లాలి ధ్యానం ఇంటికి వెలుగు అంటూ నినాదాలు చేస్తూ సెంటర్లో ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో పిరమిడ్ కేంద్ర నిర్వాహకులు నాంచారయ్య, కోట చలం, పొన్నగంటి కోటేశ్వరరావు, తోట విజయలక్ష్మి, స్వర్ణలత, భ్రమరాంబ పాల్గొన్నారు.

అన్నసమారాధన

గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులకు భారీ అన్నసమారాధనను మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. భారీగా భక్తులు వచ్చి స్వామిని దర్శించుకుని తమ మొక్కులను తీర్చుకున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు భారీ అన్నసమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు ప్రారంభించారు.